# 1 అ

రాగం : మధ్యమావతి

అదివో అల్లదివో శ్రీహరివాసము
పదివేలు శేషుల పడగలమయము ||అదివో||

అదె వేంకటాచల మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్యనివాసమఖిల మునులకు
అదె చూడుడదె మొక్కుడానందమయము ||అదివో||

చెంగట నల్లదివో శేషాచలము
నింగినున్న దేవతల నిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్నధనము
బంగారు శిఖరాల బహు బ్రహ్మమయము ||అదివో||

కైవల్యపదము వేంకటనగమదివో
శ్రీవేంకటపతికి సిరులైనది
భావింప సకల సంపదరూపమదివో
పావనములకెల్ల పావనమయము ||అదివో||

భావామృతం :

(ఒకసారి వాయుదేవునికి ఆదిశేషునికి మధ్య తమలో అధిక బలశాలి యెవరనే వివాదంవచ్చి, తగవు తీర్చటానికి నారదుని ఆశ్రయించారట. ఆయన ఆనంద పర్వతము నాశ్రయించమంటే వారా పర్వతాన్ని అడిగారట. శేషుడు నన్ను గట్టిగా



Scanned with CamScanner

బిగించి పట్టుకొంటే నువ్వు ఆ పట్టు విడిపించు అన్నదట వాయుదేవునితో 'ఆనందగిరి'. ఆదిశేషుని పట్టుకి వాయుదేవుడు బిగిసిపోయి మానవులు ఊపిరాడక తల్లడిల్లారట. దేవతల అభ్యర్ధన మేరకు శేషుడు జాలి తలచి పట్టుకాస్త సడలిస్తే వాయుదేవుడు ప్రచండవేగంతో ఆనందగిరిని ముక్కలు చేసేశాడట. దేవతల ప్రార్ధన విని ఆదిశేషుడు ఒకదానిపై తన నివాసమేర్పరచుకొన్నాడట. అదే శేషాచలం. వృషభాద్రి, నారాయణాద్రి, వరాహాద్రి, అంజనాద్రి, గరుడాద్రి, వేంకటాద్రితో కలిసి ఏడుకొండలు ఆవిధంగా ఒక్కచోట వెలశాయి. వాటిని తన నివాసంగా ఏర్పరచుకొన్నాడు వైకుంఠం నుంచి దిగివచ్చిన శ్రీమన్నారాయణుడు. తనే శ్రీవేంకటేశ్వరుడై వాటిపై వెలిశాడు)

అదిగో అల్లదిగో ఆ కనబడుతున్న వేంకటాచలం చూశారా! అదే శ్రీహరి నివాస స్థానము. అది ఆదిశేషుని పడగలతో నిండిపోయి వున్నది. (మనబోటి అల్పులకి కనబడదనుకో..) పదివేల పడగలమయమైన దానిని భావించి నమస్కరించి తరించండి. ఆ కనబడుతున్న వేంకటాచలం చూశారా! అది బ్రహ్మాదిదేవతలందరికి ఆప్యాయమైనది. మహామునులందరికీ ఆ కొండ నిత్యమూ నివాసస్థానం. వారు ఉండటానికి యెంచుకొన్నచోటు అదే సుమా! దాన్ని చూడండి. మొక్కండి. ఆనందం నిండి వుండే నెలవు అదే.

దాని దగ్గరలోనే వున్న పర్వతమే శేషాచలము. స్వర్గంలో వుండే దేవతలు భూమిపైకి వచ్చినప్పుడల్లా స్వయంగా వుండే చోటు అదే. మనయెట్ట నెదుట వుండే మూలధనం అదే. బంగారు శిఖరాలు (గోల్డ్‌కాదు...) గల ఆ పర్వతం బ్రహ్మర్షులు, బ్రహ్మత్వం సిద్ధించిన మహామహులందరికీ ఆటపట్టుగా విలసిల్లుచున్నది.

ఇక ఈ వేంకటాచలం మహిమ నేమని వర్ణించను? ఇది మోక్షప్రాప్యస్థానము. శ్రీమన్నారాయణుని అర్చావతారమైన శ్రీవేంకటేశ్వరునికి అపురూపమైన భాగ్యము ఇది. చక్కగా భావించగలిగితే సర్వసంపదలకి మారు రూపు ఇదే. పవిత్రమైన వాటన్నింటిలోకి అత్యంత పవిత్రమైనది ఈ వేంకటాచలమే.

Scanned with CamScanner

మత్తకోకిల :

ఒక్కడే పరబ్రహ్మ మానవ తొక్కటే పరమంబనెన్
చక్కనైన సుబోధ జేసెను సద్గురుడు తానాయెరా
లెక్కసేయకుడన్నమయ్యనె "రేడు" గాని మరెవ్వనిన్
దిక్కు వేంకటనాయకుండనె దీర్చిలోకములందునన్

రాగం : బౌళి

తందనాన ఆహి తందనాన పురే తందనాన భళా తందనాన
బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే ॥తందనాన॥

కందువగు హీనాధికము లిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకులమంతా నొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ ॥తందనాన॥

నిండారు రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటు నిద్ర అదియు నొకటే
మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే
చండాలుండేటి సరిభూమి యొకటే ॥తందనాన॥

కడగి యేనుగుమీద కాయు యెండొకటే
పుడమి శునకము మీద పొలయు యెండొకటే
కడుపుణ్యులను పాప కర్ములను సరిగావ
జడియు శ్రీవేంకటేశ్వరు నామమొకటే ॥తందనాన॥

## భావామృతం

'అహి' అనే పదమే నేటి కాలంలో 'ఆహా!' అయింది. 'భళా' ఆవిధంగా నేడు 'భలే' అయింది. 'పురే' నేటికాలంలో 'ఒరే' అయింది (వార్నీ!) 'తందాన' నేటికాలంలో



Scanned with CamScanner

'తందాన' అయింది. కానీ ఏకాలంలోనైనా అధికారం ఉన్నవాడు 'తందాన' అంటే వాడికి వంతపాడే వాళ్లు మాత్రం 'తానతందనాన' అని 'పత్తాసు' పలుకుతూనే వున్నారు. ఇక భావామృతంలోకి వద్దాం.

తందనాన అహి, తందనానపురే, తందనాన భళా, తందనాన. బ్రహ్మమనేది ఏకము, అద్వితీయము. అదే పరబ్రహ్మము. పరబ్రహ్మమొక్కటే అని తెలియండి.

తెలిసికొంటే ఈ సృష్టిలో హీనమైనది, అధికమైనది అనేవే లేవు. అందరిలోను అంతరాత్మ రూపమున ఆ శ్రీహరియే ఉన్నాడు. ఇక్కడ అందరిదీ జంతువుల కులమే. (మనం మానవులు అనే ద్విపాద పశువులం కదా!) అందరికీ ఆ శ్రీమన్నారాయణుడే అంతరాత్మ.

సంపూర్ణంగా నిద్రించే రాజుగారి నిద్రయు, అక్కడనే నేలపై పడుకొని నిద్రపోయే బంటుయొక్క నిద్రయు ఒకే విధముగా నుండును. అదే విధంగా అగ్రకులస్థుడైన బ్రాహ్మణుడు నివసించే భూమికి నిమ్మజాతివానికి నివాసయోగ్యమైన భూమికి వ్యత్యాసమేమన్నా వుంటుందా? ఉండదుగాక ఉండదు.

పనివడి ఒక ఏనుగుమీద కాయునట్టి ఎండ అయినా భూమ్మీద పడివుండే కుక్కమీద కాయునట్టి ఎండయినా ఒక్కటే కదా! అధికముగా పుణ్యము చేసినవారినైనా పాపాత్ములనైనా సమానముగా కరుణించేటందుకు సిద్ధపడే ఆ శ్రీవేంకటేశ్వరుని నామము కూడ ఒక్కటే. (ఇక్కడ పుణ్యులు అంటే పుణ్యకార్యాలు చేసిన వారు మాత్రమే. వారు వేంకటేశ్వరుని భక్తులు కానక్కరలేదు. ఆయన భక్తులు గీతలో చెప్పినట్లు ఆ స్వామి కెప్పుడూ ప్రియులే)



Scanned with CamScanner